క్లుప్తంగా

ఎమ్మెల్సీ కుడుపూడికి విశ్వరూప్ పరామర్శ



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్: మోకాలుకు శస్త్ర చికిత్స చేయించుకుని స్థానిక సూర్యనగర్‌లోని తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావును మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించారు. ఎమ్మెల్సీ యోగక్షేమాలను విశ్వరూప్ అడిగి తెలుసుకున్నారు. విశ్వరూప్ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, అమలాపురం మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, గన్నవరపు శ్రీనివాసరావు తదితరులున్నారు.

వరి క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ఉప్పలగుప్తంలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

ఉప్పలగుప్తం: మండలంలోని స్థానిక గ్రామంలో అధిక వర్షాలకు నీట మునిగిన వరిచేలను పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధిపతి ఎం.రామభద్రరాజు, శాస్త్రవేత్తల బృందం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షానికి నీట మునిగిన పొలాల్లో ఎకరాకు పొటాషియం నైట్రేట్ ఒక లీటర్ నీటికి 10 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. ముంపునీరు దిగిన చేలకు 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధీర్ కుమార్, నందకిషోర్, రాజశేఖర్, మనోహర్, ఏవో కుమార్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్స్‌లో చదివినవారికి మెడికల్ సీట్లు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌లలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ ప్రభుత్వ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులకు మెడికల్ కోర్సులైన ఎంబీబీఎస్ సీట్లలో 10 శాతం రిజర్వేషన్లు ఈ ఏడాది అమలు చేసినట్లు సీఎం కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 32 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే దాంట్లో 10 దరఖాస్తులు ఆమోదం పొందలేదన్నారు. మిగిలిన 22 మందిలో 8 మంది నీట్ నిర్దేశించిన మార్కులు సాధించలేదన్నారు. చివరికి 14 మంది మెడికల్ సీట్లకు ఎంపికయ్యారన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



తాళ్లరేవులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

తాళ్లరేవు: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ డిమాండ్ చేసారు. సోమవారం తాళ్లరేవు మండల పాస్టర్లు పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సంతపేట సెంటర్ నుంచి చెరువుగట్టు సెంటర్ వరకూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో దడాల శామ్యూల్‌రాజు, బీర జార్జిముల్లర్, పంపన ప్రసాద్, టేకుమూడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ చార్జీల అమలు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌లో నూతన విద్యుత్ టారిఫ్ జూన్ 16వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని జాయింట్ ఎలక్ట్రిసిటీ కమిషన్ అధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రధానకారణం సెంట్రల్ పవర్ ప్లాంట్‌ల నుంచి విద్యుత్ కొనుగోలు ధర పెరగడం వల్లే డిస్ట్రిబ్యూషన్ చార్జీలు పెంచినట్లుగా చెప్పారు. గృహ విద్యుత్ వినియోగదారులందరికీ మొదటి 0–100 యూనిట్లకు కొత్త టారిఫ్ ప్రకారం యూనిట్‌కు రూ.2.70 చొప్పున, 101 నుంచి 200 యూనిట్లకు యూనిట్‌కు రూ.4 చొప్పున, 201–300 యూనిట్ల వరకూ యూనిట్‌కు రూ.6 చొప్పున ధరలు నిర్ణయించారన్నారు.

150 మంది రక్తదానం

తాళ్లరేవు: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పి.మల్లవరంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. ప్రముఖ వైద్యుడు వీఆర్ఎస్‌బీ ప్రసాద్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ వైద్యులచే ఏర్పాటుచేసిన ఈ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో కుడుపూడి శివన్నారాయణ, ముత్యాల జయలక్ష్మి, అత్తిలి బాబూరావు, పుణ్యమంతుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కోడూరుపాడు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు



ఇంజరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు



పాతయింజరంలో రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మండల పార్టీ నాయకులు



నడిపూడిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆదినారాయణ తదితరులు

ప్రజల గుండెల్లో వైఎస్సార్‌కు సుస్థిర స్థానం

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- మహానేతకు నివాళులర్పించిన నాయకులు, కార్యకర్తలు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా స్థానిక హైస్కూలు సెంటరులోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో విశ్వరూప్ మాట్లాడారు. నాడు వైఎస్సార్ ప్రవేశపెట్టిన ప్రజోపయోగ పథకాలైన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయలేక చేతులెత్తేసే పరిస్థితికి దిగజారిపోయిందన్నారు. సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం ఎలాగూ అమలు చేయలేకపోతుందని, కనీసం వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలైనా అమలు చేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో అమలు చేసిన ప్రజారంజక పథకాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. నేటికీ రాజశేఖరరెడ్డి ఆరోగ్య ప్రదాతగా, విద్యాదాతగా నిలిచిపోయారంటే ఆయన తెచ్చిన పథకాలే కారణమన్నారు. తొలుత హైస్కూలు సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి విశ్వరూప్, ఇజ్రాయిల్‌తో పాటు వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం మండలాల పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సెంట్రల్ డెల్టా బోర్డు మాజీ చైర్మన్ కుడుపూడి బాబు, వంటెద్దు వెంకన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తన సంక్షేమ పాలనతో ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకుని చిరంజీవిగా నిలిచిపోయారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు



తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో కోడూరుపాడు సెంటర్‌లో సోమవారం వైఎస్సార్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ వైఎస్సార్ పాలన స్వర్ణయుగమని, ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు రుణ మాఫీ, 108, 104 పథకాల ద్వారా సంక్షేమ ప్రధాతగా నిలిచారని కొనియాడారు. కొమరగిరిపట్నం బ్యాంక్‌వీధిలోని స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, బీసీ సెల్ అధ్యక్షులు యల్లమిల్లి బోసు, ఎస్సీ సెల్ అధ్యక్షులు పరమట శ్రీను, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, తిక్కా ప్రసాద్, జల్లి శ్రీను, చింతా రామకృష్ణ, బొంతు సత్యనారాయణ, పాటి శ్రీరామ్, చెల్లుబోయిన రమేష్, సాపే ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా స్థానిక చెరువుగట్టు సెంటర్, సంతపేట సెంటర్‌లలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు తదితరులు మాట్లాడారు. వైఎస్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఆయన అడుగుజాడల్లో తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ప్రజా సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. ఇంజరం గ్రామంలో పార్టీ రాష్ట్ర నాయకుడు చింతలపాటి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

ఐ.పోలవరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా చూపిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని సోమవారం మండలంలోని 14 గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిర్వహించారు. జాతీయ రహదారి పాతయింజరం వద్ద, జి.వేమవరం మార్కెట్ సెంటర్‌లో, ఎదుర్లంక పంచాయితీ సమీపంలో, కేశనకుర్రు సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతయింజరం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న నిలువెత్తు రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపీపీ మోర్తాణి మిరియం జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు ఢిల్లీ నారాయణ, సఖిలే వెంకటేశ్వరావు, రాఘవులు, కొండేపూడి కృపావరప్రసాద్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఇందుకూరి రంగరాజు, మోకా రవి, సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, విత్తనాల



అమలాపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్ తదితరులు

శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15 వ వర్ధంతిని మండలంలో పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో బాలయోగి పార్కులో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదే విధంగా ఎస్.కొత్తపల్లి, గోపవరం, వాడపర్రు గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాల వద్ద పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, కుంచే రమణారావు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, జిన్నూరి వెంకటేశ్వరరావు, పెయ్యల రాజ్‌కుమార్, జొన్నాడ శ్రీదుర్గ, కుంచే బుల్లియ్య, యర్రంశెట్టి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చిక్కం బాలసుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల హనుమంతు శ్రీనువాసరావు, మండల కార్యదర్శి పినిపే జయరాజు, పార్టీ అనుబంధ విభాగ కన్వీనర్‌లు పోతుమూడి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

యానాం: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని సోమవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొటానికల్ గార్డెన్ ఎదురుగా ఉన్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిలువెత్తు కాంస్య విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్ యానాం నియోజకవర్గ ప్రజలకు చేసిన మేలును కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, పీఆర్‌వో కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం బండారులంక దంగేటివారిపాలెం సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జాన గణేష్, మాజీ ఎంపీపీ పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసంశెట్టి సత్తిపండు, దంగేటి రుద్ర, గుత్తుల మురుగుల రాజు, ఆశపు లింగమూర్తి, పెదపూడి బాబురావు, దంగేటి వెంకటశెట్టి, బట్టు టాక్సీ రామ్ తదితరులు పాల్గొన్నారు. నడిపూడి లాకుల వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, సర్పంచ్ చెల్లుబోయిన నాని, ఉప సర్పంచ్ రంకిరెడ్డి సాంబమూర్తి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాయుడు బాల తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాట్రేనికోన: నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి నిరుపేదల గుండె చప్పుడుగా నిలిచారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి అన్నారు. మండలంలోని కాట్రేనికోన, పెనుమల్లె, కందికుప్ప, పల్లంకుర్రు పంచాయతీల్లో సర్పంచులు గంటి వెంకట సుధాకర్, వంకా ఏడుకొండలు, చల్లగల వెంకటలక్ష్మి, నాతి అలివేణిల ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సుబ్రహ్మణ్యం, సలాది తులసీరావు, తటవర్తి వెంకటరత్నం, ఏడిద లక్ష్మణ్, కాశి హనుమంతరావు, మోకా చంద్రన నాగరత్నం, చల్లగల అప్పారావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, నాతి సత్యనారాయణ, వర్మాల చిన్నారావు, అక్కల శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

ముమ్మిడివరం: మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా స్థానిక పోలమ్మ చెరువుగట్టున గల వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శంకరరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, కాశి బాలమునికుమారి, పెయ్యల చిట్టిబాబు, జగతా పద్మనాభం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గొల్లవిల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు



యానాంలో రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు



బండారులంకలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



కాట్రేనికోనలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ నేతలు, అభిమానులు

పీఆర్ ఈఈ చంటిబాబు సేవలు అభినందనీయం

అమలాపురం టౌన్: జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయంలో ఈఈగా పనిచేసిన కవల చంటిబాబు సేవలు అభినందనీయమని ఎస్ఈ ఏడుకొండలు అన్నారు. ఈఈగా పనిచేస్తున్న చంటిబాబు పదవీ విరమణ సందర్భంగా స్థానిక క్షత్రియ కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన వీడ్కోలు సభకు ఎస్ఈ ఏడుకొండలు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన ఉద్యోగ ప్రస్థానంలో చివరి రోజు ఎస్ఈగా పదోన్నతి పొందిన చంటిబాబును పీఆర్ డీఈఈలు అన్యం రాంబాబు, పీఎస్ రాజ్‌కుమార్‌లు అభినందించారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన హిమాన్షు శుక్లా వీడియో ద్వారా చంటిబాబు సేవలను కొనియాడుతూ సందేశం పంపడం కూడా ఆయన పని తనానికి నిదర్శమని డీఈఈలు పేర్కొన్నారు. ఈఈ చంటిబాబు దంపతులను జిల్లా పీఆర్ ఇంజినీర్లు,



పీఆర్ ఈఈ చంటిబాబు దంపతులను సత్కరిస్తున్న జిల్లా పీఆర్ ఇంజినీర్లు, ఉద్యోగులు

ఉద్యోగుల తరుపున ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. చివరిగా ఉద్యోగ విరమణ చేసిన ఈఈ చంటిబాబును అలంకరించిన ఓ ప్రత్యేక వాహనంలో ఉంచి జిల్లా పీఆర్ ఉద్యోగులు ఆ వాహనాన్ని తాళ్లతో లాగి తమ అభిమానాన్ని చాటుకున్నారు. విశ్రాంత డీఎస్పీ శ్యామ్‌తో పాటు పలువురు పీఆర్ ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఆర్ వన్ యాప్ వినియోగంపై శిక్షణ



పీఆర్ వన్ యాప్‌పై మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: పంచాయతీల్లో నిర్వహించే పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు శుభ్రం చేయడం తదితర విషయాలను నమోదు చేసే పీఆర్ వన్ యాప్‌పై సిబ్బందికి శిక్షణ ఇచ్చామని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ పీఆర్ వన్ యాప్‌లో పొందుపరిచిన అన్ని అంశాలు సమయానుకూల పద్ధతిలో పూర్తి చేయాలన్నారు. చెత్త కుప్పలు, మురుగునీటి నిల్వలుండే పాయింట్లు, డంపింగ్ షెడ్‌లను గుర్తించడం, సమస్య పరిష్కారం తర్వాత వాటిని ఫొటో తీసి నమోదు చేయడం తప్పనిసరిగా జరగాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సత్యనారాయణ, కార్యదర్శులు శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, శ్రీరామ చంద్రమూర్తి, శిరీష, శంకరప్రసాద్, కనకమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి విఫల యత్నం

పి.గన్నవరం: చిత్తు కాగితాలు ఏరుకునే నలుగురు వ్యక్తులు మండలంలోని పెదకందాలపాలెంలో ఒక ఇంటి తాళాలు పగులగొట్టారు. అది గమనించిన స్థానికులు ఆ నలుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం యల్లమెల్లి సత్యనారాయణ కుటుంబం జీవనోపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం అండమాన్‌కు వెళ్లి అక్కడ ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం చెత్త ఏరుకునే ముగ్గురు వ్యక్తులు సత్యనారాయణ ఇంటి ప్రహారీ దూకి లోపలికి వెళ్లి తాళం పగులగొట్టారు. మరొక వ్యక్తి ఇంటి ఎదుట కాపలాగా



ఇంటి తాళాలు పగులగొట్టిన నిందితులను విచారిస్తున్న ఎస్ఐ శివకృష్ణ

ఉన్నాడు. స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పి.గన్నవరం ఎస్ఐ బి.శివకృష్ణ అక్కడకు చేరుకుని, నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

డ్రైనేజీ మూసుకుపోయి ఇబ్బందులు

అమలాపురం రూరల్: కడలి గ్రామం అరవపాలెంలో చింతపల్లి నుంచి పొన్నమండ వరకూ వెళ్లే ప్రధాన మురికికాలువలో కలిసే నామానపాలెం డ్రైనేజీ గుర్రపు డెక్క, తూడుతో మూసుకుపోవడంతో ముంపు నీరు దిగడం లేదని రైతులు అరవ సత్యనారాయణస్వామి, గరవ ప్రసాద్, బళ్ల సూర్యారావు తదితరులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాపరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనివల్ల 120 ఎకరాల మేర ఆయకట్టు ముంపు బారిన పడుతుందని, సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే అమలాపురం మున్సిపాలిటీలోని 29వ వార్డు సావరం రోడ్డులో కేటరింగ్ సెంటర్ నడుపుతున్న ఒక వ్యక్తి కాలనీ రోడ్డు ఆక్రమించి ఇబ్బందులు పెడుతున్నారని 29వ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, కాలనీ వాసులు గణేష్, మణికంఠ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఆలయంలో అన్న సమారాధన



పలివెల కొప్పేశ్వరాలయంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

కొత్తపేట: మండల పరిధిలోని పలివెల ఉమా కొప్పేశ్వరస్వామివారి ఆలయంలో ప్రముఖ అంతర్జాతీయ శిల్పి రాజ్‌కుమార్‌వుడయార్ చేతుల మీదుగా సోమవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రసిద్ధ ఆలయాల తరహాలో మాదిరిగా ప్రతీ సోమవారం పలివెల కొప్పేశ్వరాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన తలపెట్టారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ భక్తుల కోసం ప్రతీ సోమవారం అన్నసమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అన్నసమారాధన కమిటీ సభ్యులు తోట వెంకటేశ్వరరావు, యెలిశెట్టి తాతాజీ, కాంతిభారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ టి.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని అందుబాటులోకి తేవాలి

అమలాపురం టౌన్: గత ప్రభుత్వంలో రూ.2 కోట్ల నిధులతో స్థానిక మున్సిపల్ కాలనీలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లా సీపీఎం నాయకుల బృందం భవనాన్ని సోమవారం పరిశీలించింది. కూటమి ప్రభుత్వం భవాన్ని ఇలాగే వదిలేస్తే శిథిలావస్థకు చేరుకుంటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి కుళాయి చెరువు వద్ద గల కచేరి చావిడి భవనంలో అరకొర సౌకర్యాల నడుమ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్వహిస్తున్నారన్నారు. తక్షణమే సొంత భవనంలోకి అర్బన్ హెల్త్ సెంటరును మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రతినిధులు జి.దుర్గాప్రసాద్, పాలమూరి శ్రీనివాసరావు, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ హెల్త్ సెంటరు భవనాన్ని పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా నాయకులు

నిలువునా ముంచిన ఓఎన్జీసీ

అల్లవరం: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఓడలరేవు టెర్మినల్‌ను ఆనుకుని వందలాది కొబ్బరితోటలు, ఆక్వా చెరువులు ముంపుబారిన పడ్డాయి. ఓఎన్జీసీ కారణంగా ఓడలరేవు గ్రామం, 300 ఎకరాల ఆక్వా, కొబ్బరితోటలు ముంపులో చిక్కుకున్నాయని ఆ గ్రామస్తులు, రైతులు ముంపునీటిలో దిగి నిరసన తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లాడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ టెర్మినల్ నిర్మాణం కోసం గ్రామస్తులు, రైతుల నుంచి 350 ఎకరాల భూమిని ఓఎన్జీసీ తీసుకుని చుట్టూ ప్రహరీ నిర్మించిందన్నారు. ప్రహరీ నిర్మాణ సమయంలో ముంపు నీరు దిగేందుకు డ్రైన్ నిర్మిస్తామని హామీ ఇచ్చి గాలికొదిలేశారన్నారు. తక్షణమే ఓఎన్జీసీ రెండో గేటు వద్ద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి ముంపుకి పరిష్కారం చూపాలన్నారు. లేని పక్షంలో ఓఎన్జీసీ కార్యకలాపాలను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.



ముంపునీటిలో నిరసన తెలుపుతున్న ఓడలరేవు గ్రామస్తులు

వైభవంగా గంగాలమ్మ అమ్మవారి తీర్థం

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో వేంచేసియున్న గంగాలమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. గరగ రూపంలో ఉన్న అమ్మవారు ఇంటింటికీ వెళ్లగా మహిళలు నైవేద్యాలు, పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలను అందజేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలను సమర్పించారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణ, కోయ నృత్యాలు, గరగ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, ఉప సర్పంచ్ యనమదల రాణి, ఆలయ కమిటీ అధ్యక్షుడు నామాల సుబ్బారావు పాల్గొన్నారు.



పినపళ్లలో వేంచేసియున్న గంగాలమ్మ అమ్మవారు